# .... తమాషా చేసిన తప్పుడు వార్త ....

♦ రచన : శ్రీ కాంచనపల్లి రంగారావు ♦

స్టౌయ్యిమీదవున్న పాలు ఎక్కడ పొంగిపోతాయో అని దానిమీదనే దృష్టిపెట్టుకున్న నాకు అకస్మాత్తుగా 'పోస్టు' అనేమాట వినపడ్డం, ఆ వెంటనే ఒక కార్డు మామూలు స్థలంలో పడ్డం జరిగింది. మా నాన్న దగ్గరనుంచే అది వచ్చివుంటుందని చూడకుండానే నిర్ధారణ చేసుకున్నాను. ఎంతో ఆతురతతో తీసి చదివాను. నా దృష్టికేమిటో అందులోని విషయాలు ఏదో విపత్తును తోపిస్తూ ముఖం వెలవెలబోతోంది. ఇంతలో స్నానం ముగించుకొని వస్తూన్న నా భర్త 'సరూ! ఏమిటలా దిగాలబడి కూర్చున్నావు? ఇప్పటికిప్పుడు అంత వేదనకు కారణం ఏమి వచ్చింది?' అన్నారు వింతగా.

నేను మాట్లాడలేకపోతూ ఆ కార్డు చేతికందిచ్చాను. ఆయన చదివేసి తిరిగి నాకిచ్చేశారు.

'పాపం! ఎంతపనైంది!! అయితే నీవు వెళ్లవలసి వుంటుందే! నీకు ముగ్గురు మేనత్తలున్నారుగదా అందులో యిప్పుడు చనిపోయినది ఎవరో సరిగ్గా వ్రాశాడు కాదు మీ నాన్న' అన్నారు.

'అదేమిటండి అట్లా అంటారు? ముగ్గురు మేనత్తలుంటే మాత్రం వియోగంతో బాధపడుతున్నది మా కమలత్తేగదండీ! దాని విషయంలో నాకెప్పుడూ బెంగే. ఎంతో దూరంలో లేకపోయినా పాపిష్టిదాన్ని మా కమలత్తా బ్రతికివుంటూ వుండగా వెళ్ళి చూడలేకపోయాను' అంది.

'నీవు యిప్పుడు వెళ్ళక తప్పదనుకుంటాను' అన్నారు. నా ఉద్దేశం తెలుసుకునేటట్లు, వెళ్ళడం మంచిదని చెప్పూతూ వున్నట్లుగా.

'పరాయిదటండీ! స్వంతమేనత్త చచ్చిపోతే నేను వెళ్ళకుండా వుంటే బాగుంటుందా? అని అంటూ ఆ కార్డు తీసుకుని నేను ఒక్కర్తెనే బయలుదేరాను యిల్లు జాగ్రత్తఅని చెపుతూ' ఆ కార్డులో ప్రియమైన సోదరి 14వ తేదీ బుధవారం చనిపోయిందని మా నాన్న వ్రాశాడు. ఇవాళ 16. అప్పుడేపోయి 2 రోజులు! నాకు యీ ప్రయాణం ఎంతో దూరంలాగ అనిపిస్తోంది. పోతులబండీ అయినా యింకా నయం. ప్రతి స్టేషను లోను ఆగడం; ఏవేవో బస్తాలు, పెట్టెలు ఎక్కించుకోడం; దింపుతూ వుండడం యిట్లా మూలుగుతూ ఆ రైలు నడుస్తోంది. ఎట్లాగో మధ్యాహ్నం మూడుకాకముందే నేను దిగవలసిన స్టేషను వచ్చింది. అక్కడనుంచి మా కమలత్త గ్రామానికి కాలినడకను వెళ్ళవలసిందేగాని ఆ నాటుత్రోవలో ఏ బండీ వెళ్ళదు. త్రోవలో తెలిసిన ముఖాలు ఏవీ కనబడకపోవడం ఒక విధంగా మంచిదే అయింది. లేకపోతే యింకా నానడక ఆలస్యం అయ్యేదే. సూర్యాస్తమానం అయినా యిల్లు చేరుకోలేకపోయేదాన్ని. ఆ గ్రామస్థులంతా చాలా మంచివారు. కనిపిస్తే మాత్రం యీ చావువార్త చెప్పి తమ దుఃఖాన్ని అంతా నాముందు వెళ్లపోసుకొని నామీద పడి ఏడ్చేవాళ్ళే.

నేను మా కమలత్త యిల్లు చేరుకునేసరికి ఆ తలుపు సగం తీసేవుంది. నేను మెల్లిగా తలుపుతోస్తూ యింట్లో ఏడుపుముఖంతో ప్రవేశించబోతూవుండగానే వంట యింట్లోనుంచి దగ్గుకుంటూ 'ఎవరే ఆ తలువు తోసేది! అనే గొంతుకతో మా కమలత్తే నాకెదురై నన్ను గట్టిగా కాగిలించుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

'మా చెల్లాయి అంటే నీ రెండో అత్త మరిలేదు. అది బ్రతికీవుంటూ వుండగా వెళ్ళి చూడలేకపోయాను.' అని ఏవేవో తలపోస్తూ ఏడుపు సాగించింది మా కమలత్త.

ఎట్లాగో వూరడించి, శాంతిపరచడానికి ప్రయత్నించాను, ఇక్కడికి మరో నాలుగుస్టేషన్ల దూరంలోనే వున్న చనిపోయిన మా విజయత్త యింటికి వెళ్ళడానికి నేను మా కమలత్త ప్రయాణం అయ్యాం. త్రోవలో కమలత్త ఎన్నో సంగతులు చెపుతూ దుఃఖించింది.

'వూరుకో కమలత్తా. వొంటరిదానివి. నీవు వెళ్ళి చూడాలని వున్నా ఎట్లా వెళ్ళగలవు? బాగా డబ్బు, మనుష్యులు వున్న అదివచ్చి నిన్ను అప్పుడప్పుడు చూస్తూ వుండడం సబబుగాని, నీవంటిదానివి ఎట్లా కదలగలుగుతావే!' అని కమలత్త మనస్సును సమాధానపరిచాను.

'నీవు చెప్పిందంతా నిజమేనే. అయితే అదిమాత్రం

నాణ్యమునకు ప్రసిద్ధి చెందినది ''గీతా మార్కు'' చేనేత వస్త్రములు.
మీరు బట్టలను ఖరీదు చేయునప్పుడు వాటి మీద ''గీతా మార్కు'' గమనించ ప్రార్థన.
గీతా అండు కంపెని
జవుళి వ్యాపారం : : ఈరోడు,

ఎట్లా కదలగలుగుతుంది చెప్పు? దానికెప్పుడూ అతి మూత్రం-మధుమేహం యీ సంకటాలతో బాధపడుతోంది. ఆ జబ్బు ప్రవేసించినదగ్గరనుంచి ఎక్కడికీ వెళ్ళడం మానేసింది. ఎప్పుడూ మందులు, ఇంజక్షనులు అవి తీసుకోడంతోటే దాని జీవితం అయిపోతోంది' అని మా కమలత్తా తన సోదరి విజయను సమర్థించింది.

ఎట్లాగో మా విజయత్తా వున్నవూరు చేరుకున్నాము. అక్కడికి వెళ్ళేసరికి రాత్రి పది అయింది. మోహన్ అంటే మా విజయత్త కొడుకు తలుపు తీశాడు. మా కమలత్తా మోహన్ బాబును దగ్గరకు తీసుకుని భావురుమని ఏడ్చింది.

'అయ్యో! ఎంతపనైందిరా బాబూ. నీ ముద్దు ముచ్చటలు ఏవీ చూడకుండా మీ అమ్మ వెళ్ళిపోయిందిరా! ఇంత చిన్న వయస్సులో నీవు తల్లిలేనివాడిని అయిపోయావుగా.' అని తలపోస్తూ వలపోయడం సాగించింది.

'వూరుకో కమలత్తా. అదిగో విజయత్తే వస్తోంది.' అని నేను మెల్లిగా అనేసరికి మా కమలత్తా గాభరాగా తలయెత్తి ఆశ్చర్యంతో తన చెల్లెలిని చూచి ఒకర్ని ఒకరు గట్టిగా ఆలింగనం చేసుకొని 'అబ్బా! కమలక్కయ్యా! ఎన్నాళ్ళకు నిన్ను చూడగలిగానే బ్రతికివుండగామరి నిన్ను చూడగలుగుతానని అనుకోలేదు. ఒక్క ఉత్తరమక్కయినా వ్రాయవుగదా! ఎట్లాగో యిన్నాళ్ళకు నామీద అభిమానం కలిగి చూడబుద్ధి అయిందిగాబోలు! అని ఏవేవో ఆ అక్కచెల్లెళ్ళు అనుకుంటూవుండగా నేను మోహన్‌వైపు తిరిగి ఏమిటీ వింత అన్నట్లు చూశాను. మోహన్ బాబు నన్ను ఒకపక్కకు తీసుకెళ్ళి మా రాక కారణం తెలుసుకున్నాడు.

'మా మామ అంటే నీనాన్న దగ్గరనుంచి ఒక కార్డు వచ్చింది. అందులో తన సోదరి చచ్చిపోయింది అని వ్రాశాడు. కాని తన ముగ్గురు సోదరీలలో చనిపోయింది ఎవరో మాత్రం సరీగ్గా వ్రాశాడు కాడు. మా అమ్మ ఏమిటనుకుందంటే బహుశా కమలత్తే చనిపోయివుంటుందని అనుకుంది యింతవరకూ.' అని మోహన్ చెప్పాడు.

కమలత్త, విజయత్త చచ్చిపోయిందిగాబోలు అని అనుకుంది. విజయత్తేమో కమలత్త చనిపోయిందనుకుంది. బలే తమాషా జరిగిందే. బ్రతికివున్న యిద్దరు సోదరీలు ఒకర్ని ఒకరు చనిపోయినట్లుగా వూహిస్తూ ఏడుస్తున్నారన్నమాట అని మేమిద్దరం అనుకుంటూ నవ్వలేక చచ్చాం.

అయితే ఆ ముగ్గురు సోదరీలలో యిక మిగిలింది ఒక్క గంగ. గంగత్తే చనిపోవడం అనేది నిశ్చయం అని మోహన్ వెకిలిగా నవ్వుతూ మెల్లిగా అన్నాడు. దీనినిబట్టి యిప్పుడు యీ యిద్దరు సోదరీలు అక్కడికి వెళ్ళడం, మనిద్దర్నీ కూడా అక్కడకు యీడ్వడం తప్పదన్నమాట అన్నాడు ప్రయాణపు సరదా లోపల పెట్టుకొని మోహన్. మోహన్ అనుకున్నది నిజమే అయింది. కమలత్త-విజయత్తా లిద్దరు ఆ రాత్రంతా ఆ కార్డు చావువార్త మన చావులక్రిందకొచ్చిందే అని నవ్వుకుంటూ, తమ సోదరుడి వ్రాతలను నిందిస్తూ తెల్లరించారు.

గంగ బీదకుటుంబపుది అని నేను దాన్ని చూడకపోవడంగాదు. నీకు తెలుసునుగా అదీ చాలా తలబిరుసురకమని. ముఖం ముందే నోటికెంత వస్తే అంతా అనేస్తుంది. ఎదుటివాళ్ళు ఏమనుకుంటారో అనే బుద్ధి కూడా లేదు. అది ఎల్లాంటిది అయితే నేమిలే యిప్పుడు ఆ చచ్చిపోయినదాన్ని గూర్చి ఏమిటనుకున్నా మనకే పాపం. దాని ఆత్మకు భగవంతుడు శాంతిని కలిగించాలని విజయత్త తనసోదరి కమలతో అంటూవుంటే నాకాశ్చర్యం అయింది. కారణం ఏమిటంటే పాపం

గంగత్త వట్టి గంగిరెద్దులాంటిది. ఎవరు ఏదిచెప్పినా తల వూపడమేగాని ఎదిరించి మాట్లాడడం ఎరగదు. గంగమ్మగారు ఎంతో మంచిదని అందరూ అనుకుంటూవుండడం నేను స్వయం విన్నాను.

మేము అందరము కలసి యిక మిగిలిపోయిన, లేక చనిపోయినదని అనుకుంటున్న గంగత్త యింటికి వెళ్ళాము. అప్పటికి గంగత్త మా నాన్నదగ్గరే వుంటోందని మా కందరికి తెలుసు.

యింకా మేము మా నాన్న యింటిగేటు ముందుకైనా రాకముందే మా గంగత్తే ఎంతో ఆప్యాయంగా ఎదురై తన యిద్దరు సోదరీలను ఎన్నాళ్లకు చూడగలిగానే అని అంటూ మా అందరిని పలకరిస్తు లోపలికి తీసుకెళ్ళింది.

మోహన్ బాబు నా వైపు తిరిగి పొట్టపగలావవ్వుతూ 'కథ అడ్డం తిరిగింది సుమా' అన్నాడు.

'మా మామ బలే తమాషాఅయిన హాస్యగాడు. తన హాస్యాన్ని అంతా చేసి మరీ చూపెట్టాడు. కాని మన అత్తలందరిని దుఃఖపెట్టే చావు వార్త ద్వారా యీ ముగ్గురు సోదరీలను ఒకచోట సమావేశపరచాడు. ఇందులో ఏ ఒక్కరు చావకపోయినా మనం మాత్రం నవ్వలేక చస్తున్నామే అన్నాడు మోహన్ నా వైపుతిరిగి.

నేను మా నాన్న తమాషా సమర్థించాను. మా నాన్న కార్యవాది అయిన హాస్యగాడు గనుక యీచావు కార్డులో కొంత నిజం వుండివుండాలి. లేకపోతేయింతటి అబద్ధం సృష్టిస్తాడా? దీనికి ఏదో కారణం వుండివుంటుంది. మా నాన్ననే అడిగేస్తే అసలు సంగతేమిటో బైటపడుతుంది అని నేను అంటూవుండగా మా ముగ్గురు అత్తలు మా నాన్నవున్న గదిలోకి వెళ్ళడం, మోహన్ బాబు, నేనుకూడా వాళ్ళను వెంబడించడం జరిగింది. అప్పుడే వచ్చిన న్యూస్ పేపర్ ముఖాని కడ్డముగా పెట్టుకొని మా నాన్న చదువుకుంటున్నాడు. మా అందరి రాక చూస్తూనే కళ్ళజోడు కొంచెం పైకిపత్తి స్వహజ హాస్య వైఖరితో 'ఓహో! చాలా ఆశ్చర్యసమావేశంగా వుందే యిదంతా' అన్నాడు నా ముఖం చూస్తూ ఏమీ తెలియనట్లు. మా అమ్మ తన ఆడబిడ్డలు (నామేనత్తలు) ద గ్గరిని, నన్ను, మోహన్ బాబుని చుట్టు దగ్గరపెట్టుకొని పట్టజాలని వేదనతో ఎంతో మథనపడింది. ఆకార్డులోని చావువార్త మా అందరి కలయికకు కారణమైనా మా నాన్న చేసినపనికి, అఘోరమైన హాస్యానికి ఎంతో ఆశ్చర్యపోయాము. మొదట్లో అందరమూ అసలువిషయం తెలియక ఎప్పటికప్పుడు ఎంతో దుఃఖించాము. ఎట్లాగో మా నాన్న తన సోదరీల అందరి సమావేశం ఏర్పాటు చేయగలిగిన ఆ తెలివికి సంతోషించాము.

'నేను వ్రాసిన కార్డులోని చావువార్త ఎంతమాత్రం అబద్ధం కాదు. నా భార్య అయిన రుక్మిణియొక్క అక్కగారు యీ మధ్య గుండె జబ్బుచేత అకస్మాత్తుగా చచ్చిపోయారు. రుక్మిణి తన సోదరి చనిపోయిన యీ వార్తను మీ సోదరీలందరికి వ్రాయండని నన్ను కోరితే నేను వ్రాశాను. ఇప్పుడు నిజంగా చచ్చినది నా సోదరీలలో మీ కెవరూ కాదనే విషయం తెలిసింది గదా!' అని మా నాన్న చెప్పి చెప్పడం నేను మా అమ్మమీద, మా అత్తలంతా తమ వదినగారిమీద పడి ఏడ్చాము.

ఈ డొంక తిరుగుడు దుఃఖాల ముఖాలు అప్పుడు ఎట్లా వున్నాయో అని మీరందరూ అనుకోవచ్చు.

మా నాన్న ముఖం చూస్తూ మచ్చుతునకలాంటి మితాబాకాల్లావు మామా అన్నాడు మోహన్?

---

(72వ పేజీ తరువాయి)

చక్కటి సోదరభావం పెంపొందింది. ఇదే ప్రాతిపదికగా ఈ సౌభ్రాతృత్వం, ఈ సహకారం ఇతర రంగాలలో కూడ సత్ఫలితాల్ని యీయగలదని శారదానంద్ సింగ్ అభిప్రాయపడుతున్నారు.

రుమేనియాలో తాను కలుసుకున్న ప్రతి ఒక్కరూ భారతదేశం పట్ల, తన పట్ల ఎంతో అప్యాయత చూపించారని, ఆయన చెప్పారు.

రుమేనియాలో పర్యటన విశేషాలను గురించి ఇంకా ఆయన తెల్పిందేమంటే—రుమేనియా సముద్రతీరం. శెలవులను హాయిగా గడుపుకొనటాని కనుకూలంగా ఆ సముద్రతీరం వెంటకట్టిన సుందరవిహార యంత్రాభవనాలనూ చూచి తన్మయుడైనారట. ముఖ్యంగా ముద్దువచ్చే రుమేనియా బాలబాలికల తెలివితేటలు, వారి చురుకుతనం, వారి ఆరోగ్యం చూచి ఎంతో ముగ్ధుడైనట్లు తెలిపారు. 'రేపటి పౌరులే నేటి బాలలు' కాబట్టి పిల్లల జీవితం సంతోషదాయకంగా వున్నప్పుడే ఉత్తేజమయిన జాతి నిర్మాణానికి దారి తీస్తుందని శారదానంద్ సింగ్ తన ధృఢాభిప్రాయాన్ని వెలిబుచ్చారు.